Juni Khyat
(UGC Care Group I Listed Journal)
ISSN: 2278-4632
Vol-12 Issue-05 No.03 May 2022

# సాహితీ శిల్పి జాషువా చెక్కిన సతీ స్మృతి శిల్పం 'ముంటాజ్ మహల్'
# (Sahitee Shilpi Jashuwa Chakhina Satee skruti Silpam- Mumtaaj Mahal)

**Dr. Kondru Nagamalleswari**
School Assistant in Telugu, D.V.K.R.Z.P.H.S., Ponnekallu, Tadikonda Mandal, Guntur, Andhra Pradesh, India

ఈ కావ్యంలోని ఇతివృత్తం చరిత్రకు సంబంధించింది. అయినా, ఒక మాటలో చెప్పాలంటే భారతదేశాన్ని పరిపాలించిన మొఘలాయి ప్రముఖ చక్రవర్తులలో ఒకడైన 'షాజహాన్ (1628-58). బాలింత జబ్బుతో మరణించిన 'ముంతాజ్' మరణానంతరం ఆమెపై గల ప్రేమకు చిహ్నంగా, 'సతీస్మృతి'కి ప్రతీకగా ఆగ్రా నగరంలో యమునా నది ఒడ్డున చలువరాతితో నిర్మించి, ప్రపంచ వింతలలో తలమానికంగా ప్రసిద్ధి చెందిన 'తాజ్మహల్' అనే సుందరమైన 'సమాధి భవనాన్ని' నిర్మించాడు. ఇది చారిత్రక సత్యం!

కానీ, జాషువా ఈ చరిత్ర విషయాన్ని సతీస్మృతి శిల్పంగా తీసుకొని దానికి కావ్య కమనీయతతో రంగులద్దాడు. సృష్టి శిల్ప రమ సిగ మీద జాషువా చెక్కిన సిగపూవులా 'ముంతాజ్ మహల్'ను తీర్చి దిద్ది రసజ్ఞుల హృదయాలను రజింపచేశాడు.

చావు బ్రతుకు సయ్యాటలోనూగిసలాడుతున్న ముంతాజ్ బేగమ్ ఇలా తన భర్తను ఓదార్చుతూ ఈ లోకంలో జీవికి జీవితం అశాశ్వతమన్న తాత్విక చింతనతో, వేదాంత ధోరణితో ధైర్యం చెప్పినట్లు జాషువా వర్ణించిన పద్యం -

1. **ఈ సుఖదుఃఖ మిశ్రమ మహీవలయంబను సత్యశాలలో
   నీ సతినై ముగించితిని నేటికి నాడు ప్రవాసయాత్రయో
   ధీ సముపేత యిట్టి పరదేశుల చెల్మి తిరంబు గాదు క్షా
   వాస కథా విశేషములు స్వాప్నికముల్ జపలా విలాసముల్.**

భూలోకమొక 'సత్రశాల' అనీ, జీవితం దానిలో కొంతకాలం గడిపే మజిలీ అనీ, అది 'సుఖదుఃఖ' మిశ్రమమైనదని, నీ అర్ధాంగిగా నా ఈ లోక జీవితయాత్ర నేటితో ముగిసిందని, ఇది ఒక ప్రవాస యాత్ర. ఈ లోక వాసులంతా పరదేశీయులు, ఈ పరదేశ బాంధవ్యం స్థిరమైనది. కాదు. అంటూ ముంతాజ్, షాజహాన్కి చెప్పిందో లేదో మనమెరగం. కానీ, భార్యను కోల్పోయిన జాషువా ముంతాజ్ పాత్ర చేత చెప్పించిన జీవిత కష్ట సుఖాలు, జనన మరణ వైరాగ్యాలు ( శ్మశానవైరాగ్యం) సత్యాలు, వేదాంత ధోరణిని కూడా సర్వమత సారాంశంగా, వేదవేదాంగ సారంగా చెప్పించడం తన సతీస్మృతి నివాళిగా భావించవచ్చు.

అదేవిధంగా షాజహాను తానెంతగానో ప్రేమించిన తన జీవితేశ్వరిని, జీవరత్నంగా అభివర్ణిస్తూ ఆమె మరణించిన పిదప భూస్థాపితం చేయబడినందున ధరణికి 'రత్నగర్భ' అను పేరు వచ్చిందనే క్రొత్త భావాన్ని పాఠకుల మనసులో వెలయింపచేశాడు ఈ క్రింది పద్యం ద్వారా -


Copyright @ 2022 Author

ISSN: 2278-4632
Vol-12 Issue-05 No.03 May 2022

2. **నిన్ను నుదరంబులో దాచుకున్న మహికి**
**రత్నగర్భాఖ్య నేడు సార్థకమయ్యే !**
**నీవు తలమీద దాల్చి మన్నించు కతన**
**వసుధనొక బొగ్గు కోహినూరు వజ్రమయ్యె !**

అలా ముగ్ధ మోహన రూపమతియైన మహారాణి బొగ్గు రాయి (భూభ్రమణ కదలికలతో వజ్రంలా తయారవుతుంది.) నల్లటిదైనా మన్నించి జాలిపడి తన కిరీటంలో ఇతర రతన్నాలతో బాటుగా కోహినూరును ఆమె శిరస్సుపై ధరించడం వలన గొప్ప వజ్రంగా ప్రసిద్ధికెక్కిందని. మహాకవి జాషువా షాజహాన్ పాత్రా పరకాయ ప్రవేశం చేసినట్లుగా తన ఎనలేని సాహితీ ప్రతిభా సంపత్తితో వినూత్నంగా తన సతీవియోగాన్ని వైరాగ్యంతో ముంతాజ్మహల్ ద్వారా లోకానికి తెలియజేశాడు.

చరిత్రకారుల దృష్టిలో 'తాజ్మహల్' పాలరాతితో మలచిన మధుర స్వప్నంగా, మొగలాయి | కళావనంలో వికసించిన అందమైన పుష్పంగా అభివర్ణిస్తారు. కానీ భార్యా వియోగియైన షాజహాన్ ఎది అగ్నిపర్వతంవలె బ్రద్ధలై పెల్లుబికిన హృదయాంతరంగ అనంత పరివేదనమే మనో వ్యధగా, తన హృదయావేదనకు మచ్చుతునక ఈ పద్యం –

3. **'మృతులకు మరు జన్మంబులు**
**కృతులె కదా చేవియట్టి కృతి శతములచే**
**బ్రతికించి నీకు జక్కని**
**రతనాల సమాధి మందిరము గావింతున్**

మృతి చెందిన వారికి మరలా జీవం పోసేది సద్గ్రంథాలు దేవీ! శతాధిక కృతులను మించిన తనాల సమాధిమందిరం రచించి, నిర్మించి నన్ను మరలా శాశ్వతంగా బ్రతికించుకొని పవిత్రమైన నీ చరితం ఆలపించుచూ, నీ రూపాన్ని 'తాజమహల్'లో చూసుకుంటూ ప్రశాంతంగా శేష జీవితాన్ని గడుపుతానంటూ షాజహాన్ చక్రవర్తిగా తనను తాను మలచుకొని ఓదార్పు పొందుతాడు జాషువా.

స్వీయ సాహితీ జీవితానుభవాన్ని దృష్టిలో పెట్టుకొని కళాసరస్వతీ దేవికి ఉచ్చ- నీచ-కుల వివక్ష భావముండదు అంటూ చాటి చెప్పే ఈ పద్యమే అందుకు ఉదాహరణ.

**'చదువవచ్చు గ్రంథ సముదాయ మతము**

**కృతులలోని సరసులేరవచ్చు**

**రసము సృష్టి చేయు ప్రజ్ఞా విశేషంబు**

**సాధనమున రాదు చదువుకాదు" - అంటూ**

ఈ పద్య అంతరార్థాన్ని లోకానికి సాహితీ కళాశిల్పి ఈ విధంగా చెప్పాడు. బహుగ్రంథ పఠనం చేత గొప్ప పాండిత్యాన్ని సంపాదించవచ్చును. శ్రమపడి సాధనచేత కృతకమైన కృతులు రచించి రాజన్యుల దగ్గర బహుమతులు పొందవచ్చు. కానీ, కళాన్వితమైన రసబంధురమైన కవిత్వం, మనోహర శిల్ప చాతుర్యం జన్మత: రావాలి. సహజ సిద్ధంగా అబ్బాలి అంటూ జాషువా తన సాహితీ కళా శిల్ప చతురతను పై పద్యం ద్వారా ప్రజ్ఞత్వాన్ని కనబరచారు..


Copyright @ 2022 Author

ISSN: 2278-4632
Vol-12 Issue-05 No.03 May 2022

సాహితీ శిల్పి జాషువా ఈ "ముంతాజ్ మహల్" శిల్పాన్ని రచించుటకు మున్నెన్నడూ షాజహాన్ 'తాజ్మహల్'ని చూడకపోవడం ఈ రచనా శిల్పంలో ఉన్న విశేషం. 'ముంతాజ్ మహల్' కావ్య ప్రేరణకు కారణములు ఎన్నైనా కావచ్చు. మతరహిత సమ సమాజం కోసం కలం పట్టి నవ్య సాంప్రదాయ ఛందో రీతిలో రచనలు చేస్తున్న జాషువా అచ్చు భారతీయ గృహస్థ జీవన విధానాన్ని గౌరవించడం వల్ల 'ముంతాజ్ షాజహాన్ 'ల ఆదర్శవంతమైన జీవితం పవిత్రమైన నిర్మలమైన, - ప్రణయైక జీవితం జాషువాను బాగా ఆకర్షించింది. దీనితో తన సతీస్మృతికి చిహ్నంగా షాజహాన్ నిర్మించిన తాజ్మహల్ని ఆదర్శంగా తీసుకొని సాహితీకళా శిల్పంగా 'ముంటాజ్ మహల్ 'ను సాహిత్య శిల్పంగా మలచాడు.

తెల్లని పాలరాతి మూగ కావ్యంగా ఉన్న తాజ్మహల్ను సంప్రదాయములు విడువకుండా 'జాతి వైవిధ్యతను ప్రదర్శించి, పద్యరచనలోను, భావ వ్యక్తీకరణ లోను సులభ జాతీయ పద ప్రయోగ గుంభనము' వ్యక్తీకరించుటలో సరిక్రొత్తదనమును ప్రదర్శించాడు అవరసాహితీ శిల్పి జాషువా, ఆనాటి నుండి ఈనాటి వరకు సమకాలీన కావ్యములందు అనర్ఘమణియై (కోహినూర్) ఎప్పటికీ కాంతులీనుతూనే ఉంటుంది. ఈ విధంగా తెలుగు కవిత్వమనే పూదోటలో సాహితీ శిల్పి జాషువా చెక్కిన అజరామరమైన శిల్పంలా సతీ స్మృతిగా ఈ సాహితీ పూదోటలో నిలబడే ఉన్నది అనడంలో అతిశయోక్తి లేదు.

## రిఫరెన్స్ బుక్స్ :

1. ముంతాజ్ మహల్ - ఎస్.ఎల్.వి. ఉమామహేశ్వరరావు.

2. తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి. నాగయ్య

3. తెలుగు సాహిత్య వైభవం - ఆచార్య ఎన్. గంగప్ప


Copyright @ 2022 Author